


ఆరు నెలలయింది నేను ఉపదేశం పొంది. మా గురువుగారి పేరు శుద్ధానంద భారతీస్వాములవారు. పాలసముద్రంలో రంగశాయిలా ఊరికి దూరంగావున్న ఆశ్రమంలో, బ్రహ్మానంద సాగరంలో ఓలలాడుతూ వుంటారు. ముఖంలో దివ్యతేజస్సు. కళ్ళల్లో కాంతి పుంజాలు. నిండైన విగ్రహం. దర్శనమైతే చాలు, జన్మతరించినట్టుంటుంది.

అవకాశం దొరికినప్పుడల్లా

రెక్కలు గట్టుకుని వెళ్ళి, ఆశ్రమంలో వాలిపోతుంటాను.

స్వాములవారికి నమస్కరించి "లోకంనుంచీ పారిపోయి వస్తున్నాను స్వామీ!" అంటాను.

"ఏం, ఎందుకని?"—అనునయించినట్టుగా స్వాములవారి పెదవిపైన చిరునవ్వు మెరిసిపోతుంది.

"ఏం చెప్పమంటారు? ఆబాదరబందీలు చెప్పతరంగావు. కూచున్నచోట కూచోరు. నిల్చున్న చోట నిల్చోరు. ఒకటే ఉరుకులు, పరుగులు. ఉన్నదానితో తృప్తిలేదు. లేనిదానికోసం ఆరాటం. ఈ గొడవలనుంచీ విముక్తిగలిగేదెప్పుడో?" అని వాపోతాను.

"పరవాలేదులే! ఇక్కడికొచ్చేశావు గదా! నిన్ను లోకమేం చేస్తుంది?" అంటారు స్వాములవారు.

భలేవారే! నిర్విచారంగా, నిర్వికారంగా తామరాకుమీద నీటిబొట్టులావుండడం ఆయనకైతే చెల్లింది. నాబోటివాళ్ళ కెక్కడ సాధ్యమవుతుంది?

ఇంకానయం! నేనయినా అప్పుడప్పుడూ ఉచ్చులు తెంచుకున్నట్టుగా ఆశ్రమంలోకి వెళ్ళి పడి, స్వాములవారి సాన్నిధ్యంలో ఆత్మానందాన్ని చవిచూస్తున్నాను. ఈ మాత్రం అదృష్టానికి గూడా నోచుకోని దౌర్భాగ్యు లెంతమందిలేరు?

ఎవరిదాకానో ఎందుకు? మా సత్తిబాబునే తీసుకోండి. అతగాణ్ణి 'మనిషి'గా వ్యవహరించడానికి నాకు మనసొప్పదు. ముక్తసరిగా రెండక్షరాలతో 'యంత్రం' అని చెప్పొచ్చు. ఉదయం అయిదు గంటలకల్లా విద్రలేస్తాడు. ఆరింటినుంచీ తొమ్మిదిదాకా ఓ మిల్క్‌డిపోలో పనిచేస్తాడు. పదికొట్టేసరికి ఆఫీసుకు హాజరై, పనిగంటలు ముగిసేదాకా తలపైకెత్తకుండ పనిచేస్తాడు. ప్రొద్దుపోయేటప్పటికి సినిమాథియేటర్లో బుకింగ్ కౌంటరు దగ్గర అతడి డ్యూటీ ప్రారంభమైపోతుంది. రెండో ఆటకు గూడా టిక్కెట్లిచ్చి ఏ పదకొండుకో యిల్లు చేరుకుంటాడు. ఎందుకొచ్చినబాదరబందీ! ఇంతకూ పెళ్ళాం బిడ్డలుండి చెరబడుతున్నారా అంటే అదేమీలేదు. వయసు ముప్పై దాటినా యింకా పెళ్ళీ పెటాకులూ లేవు. హాయిగా, ఆనందంగా నిష్పూచీగా నిశ్చేచీగా పూలరంగడిలా వుండిపోవచ్చు గదా! ఊఁహూఁ, వుండడు. ప్రతి రోజూ ఉత్తరాలే! ఉత్తరం అందుకోగానే, జేబులో డబ్బు లెక్క

బెట్టుకుని పోస్టాఫీసుకు పరుగెడ తాడు. ఇంత సంపాదిస్తున్నాడు గదా. చాలనిదానికి యింకా అప్పులు గూడా చేస్తాడు. ఏటికి వెన్నెల కాసినట్టు, దేనికిరా బాబూ ఈ అవస్థ అంటే గ్రుడ్లప్పగించి గ్రుక్కిళ్ళు మ్రింగుతాడు. ఉద్దరిస్తే యిలాంటి యాతనా జీవినే ఉద్ధరించాలని నా ప్రయత్నం. ఒకటి రెండుసార్లు చెప్పిచూసాను కూడా!

"ఎందుకులేవోయ్ రాజశేఖరం! నా కెక్కడితీరిక? ఆ ఉపదేశాలేవో నువ్వేపొందు. నా జీవితమే నాకు గురువు దానిద్వారా నేను పొంద వలసిన ఉపదేశాలన్నీ పొందుతూనే తున్నాను" అంటాడు సత్తిబాబు.

"కాదులే సత్తిబాబూ! ఆ అనుభూతినిగురించి మాటల్లో చెప్ప లేము. అది అనుభవైకవేద్యం. స్వాములవారు పరిపూర్ణానంద స్వరూపులు. ఆయన సన్నిధిలో కూచుండే భవబంధాలన్నీ పుటుక్కున తెగిపోతున్నట్టే వుంటాయి" అని వివరించి చూచాను.

"ఇంతగా చెబుతున్నావు. ఎప్పుడైనా ఒకసారి వెళ్దాలేం" అన్నాడు సత్తిబాబు. ఎలాగైతేనేం, గుర్రం నీళ్ళు త్రాగడాని కొప్పుకుంది. ఇక ఏటిదగ్గరకు తీసుకెళ్ళడమే తరువాయి.

ఒక ఆదివారంనాటి మధ్యాహ్నం స్వయంగా నేను దగ్గరుండి అతణ్ణి ఆశ్రమానికి బయల్దేర దీశాను.

మేము వెళ్ళేసరికి ఏకాంతకుంజంలో మౌనముద్రాలంకారులై ధ్యాననిష్టలో వున్నారు స్వాముల వారు. ఓ మూలగా ఒరిగి కూర్చున్నాము. ఎత్తినకన్ను దించకుండా స్వాములవారి వైపు అదేపనిగా చూస్తున్నాడు సత్తిబాబు. మంచిదే భక్తి కుదరడానికైనా కొంత టైం కావాలిగదా!

పదినిమిషాలలా చూచిన తర్వాత వంగి మెల్లగా నా చెవిలో అన్నాడు—"రాజశేఖరం! ఇది ధ్యానమా? భుక్తాయాసమా?"

"నోర్మూసుకో సత్తిబాబూ! బుద్ధిలేకపోతే సరి. స్వాములవారి దర్శనానికి పెద్ద పెద్ద వి. ఐ. పి.లు గూడా వస్తుంటారు తెలుసా?" అంటూ చీవాట్లు పెట్టాను.

"కాదులే. ఈగ వాలినా జారి పోయేటంత నున్నగా ఆ బొజ్జా అదీ చూస్తుంటే....ఇంతకూ ఈయనగారి ఊరేదన్నావ్?"

నాకు ఒళ్ళు మండింది. అప్రాచ్యుడితో మాటలెందుకులెమ్మని మూగనోము పట్టేశాను.

"ఇప్పుడే వస్తానుండు రాజ

శేఖరం!" అని అప్పటికి తనకేదో రాచకార్యం వున్నట్టు సత్తిబాబు బయటకి వెళ్ళిపోయాడు.

స్వాములవారు కళ్లు తెరిచే టప్పటికి అరగంట పట్టింది. ఆ తర్వాత కొంతసేపటికి సత్తిబాబు కూడా వచ్చేశాడు.

"కొత్త శిష్యుడని చెప్పాను గదండీ ఇతనే! నా స్నేహితుడు, సత్తిబాబు" అంటూ పరిచయం చేసాను.

"సత్తి....బాబా?" చేదుమాత్ర మింగినట్టుగా అడిగారు స్వాముల వారు.

"మన్నించండి స్వామీ! అసలు పేరు సత్యన్నారాయణ" అన్నాను.

"పేరు సత్యనారాయణ. వూరు కమలాపురం దగ్గర కాల సముద్రం!" స్వాములవారికి చెవు డనుకున్నాడేమో, బిగ్గరగా అరిచి చెప్పాడు సత్తిబాబు.

ఎందుకోగానీ స్వాములవారికి సత్తిబాబు వాలకమేమీ నచ్చినట్టు లేదు. విరసభావం ఆయన ముఖంలో స్పష్టంగా ద్యోతక మైంది. బుద్ధి పరిపక్వత చెందక ముందే సత్తిబాబును ఇక్కడికి తీసుకురావడం నాదే పొరబాటేమో!

సమావేశం తొందరగానే ముగి సింది. ఆశ్రమంనుంచీ యివతలికి వచ్చేశాము. సత్తిబాబు తరహా అదోక మోస్తరుగా కనిపించింది. పరధ్యానంలో ఒకటి రెండుసార్లు ప్రమాదాలకు గురి కాబోయాడు కూడా!

విడిపోవలసిన చోటు వచ్చింది.

"అయితే స్వాములవారి పట్ల నీకేమాత్రం సదభిప్రాయంగానీ కుదరలేదన్న మాట!" అంటూ నిలదీసి అడిగాను.

"ఏదీ ఇందాకా తెలిసినవి కొద్దిపాటి వివరాలే! మిగిలినవి కూడా తెలియాలిగదా!" అన్నాడు.

నేను తెల్లబోయాను.

సత్తిబాబు కొనసాగించాడు. "నిన్ను కూచోబెట్టి నేను లోపలికి వెళ్ళిందందుకే. వివరాలు సేక రించాను. పౌష్టికాహారం పుచ్చు కోవడంలో స్వాములవారి ముందు మహారాజులు బలాదూరు. ఉదయం ఎనిమిదికాకముందే రెండు గ్లాసుల టొమాటో పళ్ళరసం, పదింటికి చిక్కగా అరలీటర్ పాలు మధ్యా హ్నం స్వీట్స్‌తోసహా మృష్టాన్నం, సాయంకాలం ఉపాహారంగా రెండు ఆపిల్‌పళ్ళు రాత్రి భోజనం క్రింద జానెడెత్తు దొంతరగా చపాతీలు. ఈ భోగం ఎంతటి వారయినా కోరుకోదగిందే! ఇప్ప

టికింతే సంగతులు. మిగిలిన కథ వెండి తెరపైన చూడు."

అంతే! మారు మాట్లాడే అవకాశమివ్వకుండా సత్తిబాబు వెళ్ళిపోయాడు.

ఇంటర్వెల్ కాగానే సినిమా కథలో మలుపొచ్చినట్టు రెండు రోజులు గడిచేసరికల్లా ఓ వర్తమానం నా చెవిదాకా వచ్చింది. స్వాములవారు ఆశ్రమంలో కనిపించడం లేదట! అయిపు లేకుండా మాయమైపోయారట! బొందితోనే కైలాసం వెళ్ళడం ఈ కలియుగంలో సాధ్యమా అని భక్తుల అనుమానం.

సత్తిబాబు మాత్రం చాలా తేలిగ్గా తీసుకున్నాడు.

"పోయాడా! పోయే వుంటాడులే! నేనప్పుడే అనుకున్నాను" అన్నాడు. ఇందులో ఏదోచిదంబర రహస్యం వున్నట్టు నాకు తోచింది. అదేమిటో సత్తిబాబుకు తెలిసినట్టూ వుంది. కానీ ఎంతగా బ్రతిమాలుకున్నా బయటపెట్టడే! కళ్ళెఱ్ఱ చేస్తాడు. పళ్ళు పటపట కొరుకుతాడు "ఆ బకాసురుణ్ణి గురించి నన్నడగొద్దు" అంటాడు.

ఆఖరు కెలాగైతేనేం, విశ్వప్రయత్నంమీద అసలు సంగతి రాబట్ట గలిగాను.

"నేరస్తులందరూ అంతే లేవోయ్ రాజశేఖరం! తప్పించుకుని తిరుగుతారు. ఆచూకీ తెలిసిపోతే మకాం మార్చేస్తారు. ఇతగాడూ అంతే! పోలీసులకు రిపోర్టివ్వలేక పోయావా అంటావేమో! ఇది పోలీసులకు సంబంధించిన వ్యవహారం గాదు. దీన్ని సాంఘిక నేరం అనొచ్చు. తిండిరంధి అదినుంచీ వుందనుకో! దానంతటది పెద్ద నేరం గాదు. కానీ అలాంటి వాళ్ళకు పెళ్ళాం బిడ్డలుండగూడదు. మొదటి భార్య ముగ్గురు బిడ్డల్ని మిగిలించి చనిపోతే ఈయనగారంతటితో ఊరుకోకుండా యింకొకావిడ మెడలో పుస్తె కట్టేశాడు. ఆమెకూ ముగ్గురు బిడ్డలు కలిగాక, ఈయనకు సంసారమంటే ముఖం మొత్తింది. ఇంట్లో పూట గడవని పరిస్థితిలో ఊరు వదిలేశాడు. పాతికేళ్ళ నాడు పోవడమే పోవడం! మళ్ళీ మొన్నటికి కనిపించాడు...."

నాకు మతిపోయినంత పనైంది.

"ఇంతకూ నువ్వు...నువ్వు.." అంటూ నీళ్ళు నమిలాను.

"అవున్నేనే! ఆ కుంటుంబానికి నేనే జ్యేష్టుణ్ణి" అన్నాడు సత్తిబాబు.

*